క్లుప్తంగా

మే11న జాతీయ లోక్‌అదాలత్

నరసాపురం: మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సూచించారు. నరసాపురంలో ఉన్న మొత్తం 4 కోర్టుల సముదాయంలోను అదాలత్ జరుగుతుందని చెప్పారు.ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదా, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

తొలిరోజు నామినేషన్ నిల్

నరసాపురం: నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. తొలిరోజు పార్టీనుంచి గానీ, స్వతంత్ర్య అభ్యర్థులుగా గానీ ఎవరూ నామినేషన్స్ దాఖలు చేయలేదని నరసాపురం ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అచ్యుత్ అంబరీష్ చెప్పారు. శుక్రవారం నుంచి నామినేషన్స్ హడావిడి ప్రారంభం కానుంది.

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం

యలమంచిలి: మండలంలోని శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మేడపాడు ముద్దల వారి వీధిలో ఉన్న రామాలయంలో శ్రీసీతారామ పట్టాభిషేక ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. రెండవ రోజు గురువారం సంకల్పం, సుందరకాండ పారాయణం, శ్రీసీతారామ పట్టాభిషేకం కార్యక్రమంలో 35 జంటలు పూజలో పాల్గొన్నాయి. వీరందరి చేత అంబేడ్కర్ కొనసీమ జిల్లా గుడిమెళ్లంక గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ కడియాల సుబ్రహ్మణ్యశర్మ, ప్రతిష్ఠాచార్య మానేపల్లి సత్యనారాయణశర్మ శాస్త్రోక్తంగా పూజలు, పట్టాభిషేకం చేయించారు. ఈ సందర్భంగా శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు మంగళ వాయిద్యాలు, బాణా సంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం చేశారు. పూజల అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం లక్ష తులసి పూజ, పల్లకీ సేవ, నాలుగవ రోజు శనివారం తాళాల భజన, ఐదవ రోజు ఆదివారం అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు..

పెట్రోల్ బంకుల వద్ద అప్రమత్తత అవసరం

ఆకివీడు: పెట్రోల్ బంకుల వద్ద నిర్లక్ష్యంగా ధూమపానాలు చేయరాదని, నిప్పురవ్వలు ఏర్పడకుండా వాహనాల్ని నడపాలని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు, వ్యాపారులకు, ఆసుపత్రుల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉపయోగకరమైన ప్రాజెక్టులు చేపట్టాలి

భీమవరం: అధునాతన టెక్నాలజీని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఇంజినీరింగ్ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిన్ని మరింత లోతుగా పరిశోధనలు జరిగితే మంచి ఫలితాలు వస్తాయని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి పలు ప్రాజెక్టులు రూపొందించారు. ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రాజెక్టు ఎక్స్‌పోను డాక్టర్ ఎం.జగపతిరాజు ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, సీఎస్ఈ అధ్యాపక బృందం డాక్టర్ కె.శ్రీహరి వర్మ, డాక్టర్ వీవీ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీరపేరంటాలమ్మ జాతర

ఉండి: వీరపేరంటాలమ్మ 71వ వార్షిక మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈనెల ఈనెల 9న ప్రారంభమైన జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పదిరోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన జరిపారు. జిల్లా నుంచే కాకుండా కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మే 1వ తేదీ నుంచి సువార్త సభలు

ఉండి: మే 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉండి చిక్కాలవీరన్న నగర్‌లోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ జీ లూథర్ తెలిపారు. ఉండి పెదపేట ప్యారిష్ పాస్టర్ ఎం.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించే ఈ సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ జాన్‌వెస్లీ (ఏలూరు), బ్రదర్ పీ జేమ్స్(వేట్లపాలెం), బ్రదర్ జాన్ (అమరావతి) విచ్చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశ్వాసులు ఈ సభలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని కోరారు.

సంక్షేమ సారథికి జేజేలు

- వెల్లువెత్తిన అభిమానం
- అపూర్వ స్వాగతం పలికిన జనం


దొంగరావిపాలెంలో ఎండను సైతం లెక్క చేయకుండా సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు


దొంగరావిపాలెంలో వృద్ధురాలి సమస్యలు ఆలకిస్తున్న సీఎం జగన్

పెనుగొండ: ఎస్సార్ సీపీ అధ్యక్షుడు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయ సంకల్పంతో అడుగులు వేస్తుంటే...ప్రజలు మేమంతా సిద్ధం అంటూ సంక్షేమ సారథికి జయహో అంటూ స్వాగతం పలికారు. జిల్లాలో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రకు గురువారం బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ బస్సుయాత్రకు వైఎస్సార్ సీపీ శ్రేణులు నీరాజనం పట్టారు. కేరింతలతో సందడి చేశారు. తేతలిలో బయలుదేరిన సీఎం జగన్ కోసం గంటల ముందే రోడ్లపైకి చేరి జనం నేత జగన్‌మోహన్‌రెడ్డి కోసం వేచి చూశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు దొంగరావిపాలెం కూడలికి చేరుకొన్నారు. అభిమానులు మోకాళ్లపై ఎండలో కూర్చొని ఘన స్వాగతం పలికారు. సీఎం .. సీఎం అంటూ కార్యకర్తలు అభిమానులు నినాదాలతో హోరెత్తించారు.

తేతలి నుంచి స్వాగతం

జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తేతలి నుంచి స్వాగతం పలికి సీఎం జగన్‌తో బస్సులో కలిసి వచ్చారు. దొంగరావిపాలెం కూడలి వద్ద కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ రాపాక వరప్రసాద్‌లు స్వాగతం పలికి కోనసీమ జిల్లాకు తోడ్కొని వెళ్లారు. నరసాపురం అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సైతం సీఎం బస్సులోనే తేతలి నుంచి దొంగరావిపాలెం వరకూ వచ్చి ప్రజలకు అభివాదం పలికారు.

మోకాళ్లపై కూర్చొని అభిమానాన్ని చాటుకొని..

ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, పెనుగొండ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి మోహనరావు, పెనుగొండ ఎంపీటీసీ తాడిసుబ్బిరెడ్డి, ముస్లిం సంఘ నాయకుడు షేక్ ఉమర్ షరీఫ్, శెట్టిబలిజ సంఘ నాయకుడు యాంద్ర శ్రీను ఇతర అభిమానులు దొంగరావిపాలెం వద్ద మోకాళ్లపై మండుటెండలో రోడ్డుపై కూర్చొని స్వాగతం పలుకుతూ అభిమానాన్ని చాటుకొన్నారు.


దొంగరావిపాలెంలో సీఎం జగన్ కోసం ఎదురు చూస్తున్న విప్ జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ రాపాక వరప్రసాద్‌లు


దొంగరావిపాలెం వద్ద సీఎం జగన్‌తో కలిసి అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


దొంగరావిపాలెంలో మండుటెండలో మోకాళ్లపై కూర్చుని స్వాగతం పలుకుతున్న అభిమానులు

నేడు శ్రీరంగనాథరాజు నామినేషన్


చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10.57 నిమషాలకు ఆచంటలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దాఖలు చేయనున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఉదయం 9 గంటలకు తూర్పుపాలెం కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించి అభిమానులతో పాదయాత్రగా ఆచంట కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

నామినేషన్‌కు భారీగా తరలి రావాలి

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు శుక్రవారం నామినేషన్ దాఖలుచేయనున్నారని, భారీగా అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు ఓ ప్రకటనలో కోరారు. శ్రీరంగనాథరాజు ఆచంట నుంచి శాసన సభ్యుడుగా ఎన్నికైనప్పటి నుంచి అన్ని వర్గాలతో పాటు, ముఖ్యంగా దళిత, బహుజన వర్గాలకు నామినేటెడ్ పదవులలో పెద్దపీట వేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఎపుడూ ఎవరూ చేయని అభివృద్ధిని ఆచంట నియోజకవర్గంలో చేసి చూపారన్నారు. శ్రీరంగనాథరాజుకు మద్దతుగా ప్రతి ఒక్కరూ తరలి రావాలని మంగరాజుతో పాటు మాలమహానాడు యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర సీతారామ్, వైఎస్సార్ సీపీ నాయుడు ఇందుకూరి మురళీ కృష్ణంరాజులు కోరారు.

నేడు ముదునూరి నామినేషన్


ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

నరసాపురం: నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9 గంటలు నుంచి మొగల్తూరు మండలం పాతపాడు నుంచి ఆయన ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. పాతపాడు నుంచి పట్టణం మీదుగా భారీ ర్యాలీ సాగనుంది. ముదునూరి నామినేషన్ దాఖలు, ర్యాలీకి సంబందించి పార్టీ శ్రేణులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

మొగల్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు మండలంలోని పాతపాడు గ్రామం నుంచి ఉదయం 9గంటలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీగా కాళీపట్నం, కొత్తోట, ముత్యాలపల్లి మొగల్తూరు మీదుగా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారన్నారు.

బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ వారికి శృంగవృక్షం గ్రామానికి చెందిన దండు రామకృష్ణంరాజు –జయజ్యోతి దంపతులు గురువారం 8 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి ఫొటో శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం


పాలకొల్లు సెంట్రల్: వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు


నరసాపురం: 23వ వవార్డులో ప్రచారం చేస్తున్న శారదావాణి


నరసాపురం రూరల్: లిఖితపూడిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ముదునూరి శ్రీకృష్ణంరాజు

పాలకొల్లు సెంట్రల్: పేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ సీఎంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. గురువారం పట్టణంలో 20వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ ప్రచారంలో ప్రజలు ముఖ్యంగా మహిళలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రచారంలో తిరుగుతున్న ప్రతీ గడపలో తమకు ఏదో ఒక పథకం అందాయని చెబుతున్నారన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్న రుణం తీర్చుకోవాలంటే తప్పనిసరిగా తమ ఓటు జగనన్నకే వేస్తామని ముక్తకంఠంతో మహిళలు ఆనందోత్సాహాలతో చెప్పడం ఒకింత ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ఓటర్లలో నీతి నిజాయితీ ఉందని ఇంత ప్రజాదరణ పొందిన జగనన్నలాంటి నాయకుని వెంట నడవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రజాధరన చూస్తుంటే పాలకొల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కోటలకు బీటలు తప్పవని వైఎస్సార్ పార్టీ జెండా అత్యధిక మెజార్టీతో రెపరెపలాడుతుందని అన్నారు. ఈ ప్రచార యాత్రలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, కొప్పగింజల శ్రీను, కొప్పగింజల హనుమంతు, పెదపాటి పెద్దిరాజు, మద్దా చంద్రకళ, విప్పర్తి ప్రభాకర్, గుమ్మాపు వరప్రసాద్, విన్‌స్టన్‌బాబు, ఖండవల్లి వాసు, రామాంజుల పెద్దమదు, సనమండ సురేష్, బండి రమేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, చెన్ను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలి

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ముదునూరి సతీమణి శారదావాణి ప్రజలకు సూచించారు. భర్త గెలుపు కోరుతూ శారదావాణి పట్టణంలోగత కొన్ని రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ తిరుగుతున్నారు. గురువారం ఆమె పట్టణంలోని 23వవార్డు ప్రచారం నిర్వహించారు. ఇంటిటికీ తిరగి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ముదునూరి గత ఐదేళ్ల నుంచి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆక్వా యూనివర్సిటీని తీసుకొచ్చారని చెప్పారు. బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్ వంటి కీలక ప్రాజెక్ట్‌ల్లో కదలిక తీసుకొచ్చిరని వివరించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ముదునూరి ప్రసాదరాజును మరోసారి ఎమ్మెల్యేగా చేయాలన్నారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ కావలి రామసీత, నాయకులు కావలి నాని, కావలి నాగరాజు, వంగలపూడి జక్కరయ్య, పతివాడ పద్మ, కాగిత సత్యవాణి తదితరులు ఉన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

నరసాపురం రూరల్: ముదునూరి ప్రసాదరాజును ఎమ్మెల్యేగా మరోమారు గెలిపించాలని ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు అన్నారు. గురువారం లిఖితపూడి గ్రామంలో తనదైన శైలిలో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఫిషరీస్ యూనివర్సిటీ దేశంలోనే మూడవదని అన్నారు. కోస్టల్ ఏరియాలో ఆక్వాజోన్లు ఉండటంతో రానున్న రోజుల్లో యూనివర్సిటీ దినదిన ప్రవర్ధమానం చెందుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నాన్నను గెలిపించండి అంటూ వినమ్రత్నంగా ఆయన చేస్తున్న ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం


వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పోడూరు: రాష్ట్రంలో సీఎం జగనన్నతోనే అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి అన్నారు. పెనుమదంలో గురువారం మండల కన్వీనర్ పితాని చిన్నా, గ్రామకమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనలో మహిళలు, రైతులకు అన్నివర్గాల ప్రజలు గతంలో లేనంతగా లబ్ధి పొందారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందించారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు రెండుకళ్లుగా వైఎస్సార్ సీపీ పాలన సాగుతుందన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లుదండుకుని అధికారంలోకి రావాలని కూటమిగా వస్తున్న పెత్తందారులు కలలు గంటున్నారనీ, రాష్ట్రం పెత్తందారుల చేతుల్లోకి వెళ్లితే సర్వనాశనం కావడం ఖాయమన్నారు. అందుకే త్వరలో రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను వైఎస్సార్ సీపీకి వేసి సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పాలకొల్లు ఎమ్మెల్యేగా తనను, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించేందుకు కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని గోపి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకవర్గ సభ్యుడు మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, బీసీ సంఘం జాతీయ నేత గూడూరి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ పితాని చిన్నా, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, యూత్‌విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచలపల్లి విన్‌స్టన్‌బాబు, సొసైటీ చైర్మన్ కొప్రపాటి వీరాస్వామి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు బాబి, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, ముమ్మిడివరపు అంజిబాబు, గ్రామకమిటీ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

నరసాపురం రూరల్: మండలంలోని పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గురువారం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొప్పర్రు గ్రామంలో పురాతన సీతారామస్వామి ఆలయంలో బోడపాటి కృష్ణానందం ఆర్థికసాయంతో నిర్మించిన రథంలో స్వామివారి గ్రామోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చినిమిల్లి బాబులు, ఆలయ మాజీ చైర్మన్‌లు రావి బ్రహ్మాజీ, చినిమిల్లి వీరబాబు, యాదం రెడ్డి సూరిబాబు, కంచర్ల బాబులు పలువురు భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కొప్పర్రు సీతారామస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.

వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్న చేరికలు


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న గౌడ, శెట్టిబలిజ మహిళలు


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న యువకులు

పెనుగొండ: మండలంలోని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో 200కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. పెనుమంత్ర గరువు నుంచి గౌడ, శెట్టి బలిజ మహిళలు, యువకులు భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. చేరిన వారిలో బోంతు వెంకట రమణ, కొనకళ్ల వెంకట రాంబాబు, పూరిళ్ల ముసలయ్య, కొనకళ్ల నాగేశ్వరరావు, మిడతా వెంకట నరేంద్ర, వెలుదూటి దుర్గాప్రసాద్, ఉడతల పెద్దిలు, ఆరేపల్లి శ్రీనివాసు, ఆరేపల్లి వెంకట శ్రీను, మాకా సత్యనారాయణ, తాళాబత్తుల ప్రసాద్, బొంతు భాస్కర రావు, మేకా రాంబాబు, కుడపూడి శ్రీను, కుడిపూడి మహేష్, ఉడతల వరుణ్ మాళీ, చిటికెన నాగేశ్వరరావు, మేకా మధు, మేకా సత్య సాయిబాబా, కొనకళ్ల బన్నీ, కొనకళ్ల సతీష్, పూరిళ్ల రాము, పూరిళ్ల పెద్దిరాజు, అకిశెట్టి బాబూరావు, గెద్దాడ నరేష్, నేలపాటి సురేష్, పాలమూరి గమ్మానియేల్, పీతల సాయి, చిటికెన సత్యానందం, మాన్యం గణేశ్వరరావు, మారిశెట్టి ఆంజనేయులు, కొనకళ్ల రామసత్యకుమార్, చిటికెన శంకరం, మాన్యం రాజు, పూరిళ్ల నాగు, యర్రింకి అచ్చేశ్వరరావు, కారింకి దుర్గారావు, ఆకుల రాంబాబు, సత్తి వెంకట రెడ్డిలతో పాటు వందలాది మంది మహిళలు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వేసవి దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని ఎంపీడీవో పి పద్మజ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మండల పరిషత్ సమావేశంలో ఎటువంటి ప్రతిపాదనలు ప్రవేశపెట్టే అవకాశం లేనందున స్థానికంగా ఏ పంచాయతీలోనైనా మంచినీటి సమస్యలు ఉంటే సభదృష్టికి తీసుకురావాలన్నారు. ఏ గ్రామంలో అయినా మంచినీటి సమస్యలు ఉంటే తెలియజేయాలని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి సభ్యులకు సూచించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా మంచినీటి సమస్యలు ఎదురైతే తక్షణం 94917 18115 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి కొద్దిసేపటికే సమావేశాన్ని ముగించారు. సమావేశంలో తహసీల్దార్ కోట లక్ష్మీ కల్యాణి, పాలమూరు సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు నరశింహమూర్తి, ఎం నాగదుర్గ, పలివెల ఆశాలత, పెనుగొండ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.